# అమాంబాపతులే ఖాయం

కొంతమంది ఆడపిల్లల చొరవ, ధైర్యం మొదలైనవి చూస్తే, "వీళ్ళు మగ పిల్లలుగా ఎందుకు పుట్టలేదా?" అనిపిస్తుంది. ముఖ్యంగా సంసారం అనే బండి నడపడం కష్టంగా వున్నప్పుడూ, ఇతరత్రా కష్టాలు వచ్చినప్పుడు కన్నతండ్రి ఈ విధంగా ఆలోచిస్తూ ఉంటాడు. ఇటువంటి పిల్లే ఝాన్సీ.

పరమేశం - పార్వతీ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు. ఆ ముగ్గురి ఆడ సంతానంలో మధ్యది ఝాన్సీ. చాలా చురుకైన పిల్ల! ఏ పనినైనా అవలీలగా సాధించగల నేర్పు కలది.

ఒకసారి ఝాన్సీకి పన్నెండు ఏళ్ళు వున్నాప్పుడు వాళ్ళ ఊరికి ఒక ఆఫీసర్ ధాన్యం నిల్వలు తనిఖీ చేయడానికి వచ్చాడు. ఆ ఊరి మునసబుగారి మూడో అమ్మాయి, ఝాన్సీ మంచి స్నేహితులు. ఆ రోజు కూడా ఝాన్సీ మునసబుగారింటికి ఆడుకోవడానికి వెళ్ళింది.

మునసబుగారు దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

"ఏమిటి మామయ్యా ఆలోచిస్తున్నావు?" అంది ఝాన్సీ.

"నీకెందుకే చిన్నపిల్లవు. నువ్వు వెళ్ళు' అన్నారాయన.

"చిన్నపిల్లలకి చెప్పకూడని విషయమా?" అంటూ మొదలుపెట్టింది.

"ఊరికే కాలయాపన చేస్తే చాలదు. దీనికి చెప్పేస్తే వదిలిపోతుంది' అని ఆయన విషయం చెప్పారు.

"ఏమీలేదు ఝాన్సీ. ఒక ఆఫీసరు ధాన్యం బస్తాలు తనిఖీ చేయడానికి వచ్చాడు ఊళ్ళోకి. "మన దగ్గర కూడా రెండువందల బస్తాలు నిల్వవున్నాయి. అంత నిల్వ ఉండకూడదు......'

మధ్యలోనే అందుకుని "ఓస్! ఇదేం పెద్ద సమస్యా?" అని మొదలుపెట్టింది. "ఆధాన్యం వున్న గది చూపించు. ఆయన వచ్చేనరికి, నేను ఆ గది ముందు ఒక కుర్చీలో కూర్చుంటాను. ఆయన తనిఖీ చేయకుండా చూస్తాను" అంది.

ఝాన్సీ తెలివైనదని మునసబుగారికి తెలుసు. "జాగ్రత్త ఝాన్సీ! పట్టుకుంటే కొంప మునిగిపోతుంది" అన్నారు మునసబుగారు.

"నీ కొంపే కదా మామయ్యా. మాకేం" అంది నవ్వుతూ.

సరే! ఆఫీసర్ రానే వచ్చాడు. ఆ గది ముందు చెప్పిన ప్రకారం కుర్చీ వేసుకుని

కూర్చుంది ఝాన్సీ. అన్ని గదులూ తనిఖీ అయిపోయాయి. ఈ ఒక్క గదే వున్నది. ఆయన్ని చూస్తునే నమస్కారం పెట్టింది ఝాన్సీ.

"ఉండామ్మా. తలపు తీసి చూడాలి" అన్నాడు ఆఫీసర్

"ఈ రోజు మా అత్తయ్య పెద్ద కూతురికి పురుడు వచ్చింది. లోపల బాలింతరాలు, పిల్లా వున్నారు. ఏ కుక్కలైన లోపలికి వస్తాయేమోనని చూడమని ఇక్కడ నన్ను కుర్చీబెట్టింది మా అత్తయ్య. మెల్లగా చూడండి చప్పుడైతే పిల్లాడు భయపడతాడేమో" అని తలుపు తియ్యబోయింది ఝాన్సీ.

"వద్దులే అమ్మా అక్కర్లేదు పసికందు భయపడితే ఏ జ్వరంమైనా వస్తుంది. అసలే బాలింతారాలు" అని తనిఖీ చేయకుండా వెళ్ళిపోయాడు ఆఫీసరు.

తర్వాత ఈ విషయం తెలిసిన ఊళ్ళోవాళ్ళు ముక్కు మీద వేలేసుకున్నారు ఝాన్సీ తెలివితేటలకి. ఆ రోజు ఝాన్సీకి దిష్టి తీయించాడు పరమేశం.

"మొత్తానికి నీ కూతురు వజ్రం అయ్యా" అన్నాడు మునసబు, పరమేశంతో. తమ్ముడి దగ్గరికి పట్నం పంపాడు పరమేశం. అక్కడ ఇంటర్‌లో చేరింది. అన్నీ ఫస్టుమార్కులే తెచ్చుకుంటోంది. పరమేశం తమ్ముడికి, ఎదురుగా వుండే హెడ్ మాస్టారు కుటుంబానికీ చాలా స్నేహం. ఆ మాస్టారుగారికి ముగ్గురు ఆడపిల్లలు. ఆయన రిటైర్‌మెంట్ దగ్గర పడుతోంది. వాళ్ళ పెద్ద అమ్మాయికి ఒక పెళ్ళి సంబంధం ఖాయం చేసుకున్నారు. ముహూర్తం కూడా నిశ్చయం చేసుకున్నారు. ఆ మగ పిల్లవాడి తండ్రి కట్నం కాకుండా, వెండి కంచం, ఒక స్కూటరు కావాలని కబురు పంపాడు మాస్టారుకి.

"ముందు అమాంబాపతులు లక్ష రూపాయలకే ఒప్పుకుని మళ్ళీ ఇవన్నీ అడుగుతున్నారు" అని మాస్టారు బాధ పడుతూ పరమేశం తమ్ముడితో చెప్పడం, అక్కడే వున్న ఝాన్సీ వింది.

"ఏం బాధ పడకండి మాస్టారూ తాంబూలాలదాకా రానివ్వండి. ఆ రోజు నేను చూస్తాను" అంది.

మాస్టారు ఆశ్చర్యపోయి పరమేశం తమ్ముడికేసి చూసాడు.

"ఏం ఫర్వాలేదు మాస్టారు. మా ఝాన్సీ చాలా తెలివైనది" అంటూ ఆ ధాన్యం నిల్వల విషయం చెప్పాడు మాస్టారుకి.

తాంబూలాల రోజు వచ్చేసింది. అంతా సిద్ధమైంది. "మరి మేము కట్నం కాకుండా అడిగినవి ఏం చేసారు?" అని పిల్లాడి తండ్రి మాస్టార్ని అడిగాడు. అప్పుడే ఝాన్సీ వచ్చి మెల్లగా చెప్పింది ఆ మగ పిల్లగాడి తండ్రికి మాత్రం వినబడేటట్లు.

"మాస్టారూ! ఎవరో మీ చుట్టంట. డిప్యూటి సూపరిండెంట్ ఆఫ్ పోలీసట. ఆయన పక్క వాళ్లింటికి ఫోన్ చేసారు. ఆయన ఇప్పుడు అర్జంట్ పనివుండి రాలేకపోతున్నారట. పిల్లాడికి ఇవ్వవలసిన స్కూటరు అవీ ఆయన చూస్తారుట, ఏం కంగారులేదని మీకు చెప్పమన్నారు. మాస్టారూ. నేను వస్తా కాలేజీకి టైమ్‌యిపోయింది" అని వెళ్ళిపోయింది.

పిల్లాడి తండ్రికి ఒక్కసారి కంగారు పుట్టింది.

"ఊరికే లాంఛనంగా వుంటుందని అడిగాం బావగారూ!"

"అయ్యో దానికేం వుంది. ముందు మాట్లాడుకున్నట్లు అమాంబాపతులే ఖాయం" అంటూ నిశ్చయ తాంబూలాలు తీసుకుని బ్రతుకుజీవుడా అనుకుని వెళ్ళిపోయాడు. కాబోయే వియ్యంకుడు.

మాస్టారు "అమ్మో ఝాన్సీ" అనుకుంటూ సంబరపడిపోయాడు. "నిజంగా ఝాన్సీ చాకులాంటి పిల్లయ్యా. ఇటువంటి పిల్ల అసలు మగాడిగా పుట్టవలసింది" అన్నారు మాస్టారు, పరమేశం తమ్ముడితో.

---

(ఆంధ్రభూమి మాస పత్రిక జూలై 2004)